క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సౌకర్యాలు

చిలుకూరువారిగూడెం(మైలవరం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సౌకర్యాలు కల్పిస్తోందని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం చిలుకూరువారిగూడెం అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ట్యాబ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు, అమ్మ ఒడి, గోరుముద్ద, ట్యాబ్స్ పంపిణీ తదితర ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుని, వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి, పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరు రామకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.నారాయణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలి

జూపూడి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్, ఆరోగ్యశ్రీ పథకం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని జూపూడిలో ఆరోగ్యశ్రీ, అభ కార్డుల పంపిణీ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. సచివాలయ పరిధిలో 1243 కార్డులకు గాను ఇప్పటికి 899 పంపిణీ చేసినట్లు ఆరోగ్య సిబ్బంది ఆయనకు తెలిపారు. కార్డుల నమోదు, ఈకేవైసీలో తలెత్తుతున్న లోపాలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కార మార్గాలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు వివరించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పర్వీన్, డీపీఎంవో డాక్టర్ నవీన్, సీహెచ్‌వో నారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈలో మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు ప్రారంభం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు, ఐఐటీలు, ఐఐఎస్‌సీ కలిసి మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సును సోమవారం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఎన్‌పీటీఈఎల్ సంస్థతో తమ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

మైలవరం: మైలవరం మండలం కీర్తిరాయునిగూడెంలో మంగళవారం ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సచివాలయ భవనం ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు మండలంలోని కనిమెర్ల తండాలో రూ.50లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రహదారులు ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మైలవరం పట్టణంలో డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్స్‌తో నిర్మించిన సిమెంట్ రహదారులు, 3 గంటలకు జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామంలో రూ.1.82 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారు.

నేడు సూరేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

ముసునూరు: మండలంలోని సూరేపల్లి సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ, నోడల్ అధికారి జి.రాణి, వైద్యాధికారి కరీముల్లా చెప్పారు. ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు కరీముల్లా, అవినాష్, షకీనా ఇవాంజిలిన్‌లతో పాటు మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు చేస్తారని తెలిపారు.

నిమ్రాలో అంతర్జాతీయ ప్రోస్థోడాంటిస్ట్ డే

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా డెంటల్ కళాశాలలో అంతర్జాతీయ ప్రోస్థోడాంటిస్ట్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ బెస్ట్ స్మైల్ కాంటెస్ట్, ప్లాస్టర్ స్కల్ప్టింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, కార్టూన్ ప్రోస్థడాంటింగ్, మొదలైన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాహిత్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అఫ్రీన్, రమ్య, సునీత, పద్మిని, రోమానంద్, అయేషా పాల్గొన్నారు.

ఘనంగా ఈదర సహాయ మాత ఉత్సవాలు

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర నిత్య సహాయ మాత ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం తేరు ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పాప సంకీర్తన కార్యక్రమాన్ని ఈదర విచారణ గురువులు ఫాదర్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి ఫాదర్ లాము జయరాజ్ దివ్య బలిపూజ సమర్పించారు. సహాయ విచారణ గురువు రవి పాల్గొన్నారు.

రబీ పంటల ఈ-క్రాప్ నమోదు ప్రారంభం

తిరువూరు: రబీ సీజన్లో సాగు చేసే పంటలను ఫిబ్రవరి 10 లోపు ఈ-క్రాప్ నమోదు చేయాలని తిరువూరు ఏఓ పద్మ తెలిపారు. సోమవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ బుకింగ్ ప్రారంభించామని, రైతులు తమ పంటల వివరాలను తప్పక నమోదు చేయించాలన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన పంటలకే పంటల బీమా పథకం, సున్నా వడ్డీ రుణాలు, ఆర్బీకేల్లో పంటల కొనుగోలుకు అవకాశం ఉంటుందన్నారు.

అంతా రామమయం, జగమంతా రామమయం


నూజివీడులో స్వామివారి శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు


ఆగిరిపల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


గంపలగూడెం షిర్డిసాయి ధ్యాన నిలయంలో..


తిరువూరులో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


నూజివీడులో ప్రత్యేక వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నూజివీడు: అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపన కార్యక్రమం నేపథ్యంలో సోమవారం శ్రీరామ భక్తులు పట్టణంలోని డీఏఆర్ కళాశాల లోపల ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై ఊరేగించారు. ఈ శోభాయాత్ర చిన్న గాంధీబొమ్మ సెంటర్, పెద్ద గాంధీబొమ్మ సెంటర్, పీజీ సెంటర్‌ల మీదుగా డీఏఆర్ కళాశాల వరకు నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పెద్ద స్క్రీన్‌లలో ఆయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులు కోలాటాలు, నృత్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పలు రామమందిరాల్లో పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఎంప్లాయిస్ కాలనీలో మహిళలు దీపాలను వెలిగించి, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు.

చనుబండలో మార్మోగిన రామ నామం

చాట్రాయి: అపర భద్రాద్రిగా పేరుగాంచిన మండలంలోని చనుబండ శ్రీ కోదండ రామాలయంలో ఏపీ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనేరు అభయాంజనేయ స్వామి కమిటీ ఆధ్వర్యాన 3 వేల మందికి అన్నదానం చేశారు. నాలుగు గంటలకు అభయాంజనేయస్వామి కమిటీ ఆధ్వర్యాన కాషాయ జెండాలతో బైక్ ర్యాలీ చేశారు. టపాసులు కాల్చుకుంటూ స్వామి వారిని ఊరేగించారు. చాట్రాయి రామాలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠను తిలకించారు. అనంతరం యువకులు గ్రామంలో స్వామివారిని ఊరేగించారు.

కోలాహలంగా రామభక్తుల పాదయాత్ర

గంపలగూడెం: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గంపలగూడెం రామ, హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పాదయాత్ర కోలాహలంగా సాగింది. గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం వరకు 6 కిలోమీటర్ల దూరం భక్తులు పాదయాత్ర జరిపారు. 2 వేల మంది భక్తులు జెండాలను చేతబూని పాదయాత్రలో పాల్గొన్నారు. తొలుత స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మేడూరు శ్రీవీరాంజనేయస్వామి సన్నిధికి చేరుకున్న అనంతరం భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని పెనుగొలను, ఊటుకూరు, నెమలి, గోసవీడు, అర్లపాడు తదితర గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో రామ సంకీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు.

రాయనపాడులో శ్రీరామనామ సంకీర్తన

రాయనపాడు(విజయవాడరూరల్): అయోధ్య శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని రాయనపాడు గ్రామంలో ఉన్న శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు రామ నామ సంకీర్తన నిర్వహించారు. అనంతరం 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడరూరల్ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు, పోలసాని పాపారావు, కాటంనేని మురళీకృష్ణ, వేముల రామారావు, బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిరువూరులో శోభాయాత్ర

తిరువూరు: తిరువూరులోని పలు దేవాలయాల్లో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. శ్రీకోదండరామాలయం, శ్రీషిర్డిసాయి మందిరం, రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయం, పాత తిరువూరు రామాలయాలలో రామనామ సప్తాహం, శ్రీసీతారామ కల్యాణం, ద్వాదశ నామ పారాయణం, సహస్ర దీపాలంకరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. తిరువూరు రాజుపేట నుంచి రామభక్తబృందం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తిరువూరురూరల్: సోమవారం తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. అక్కపాలెం, చిట్టేల, కోకిలంపాడు, జి.కొత్తూరు, రామన్నపాలెం, రోలుపడి, వామకుంట్ల, గానుగపాడు, చౌటపల్లి గ్రామాల్లో సీతారాములకు శాంతి కల్యాణం, ఏకనామ సప్తాహం తదితర కార్యక్రమాలు జరిగాయి.

పల్లెల్లో మార్మోగిన శ్రీరామ నామ స్మరణ

జి.కొండూరు: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక శ్రీ కోదండ రామాలయంలో గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ నిర్వాహకులు, సోమవారం శ్రీరాముడి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. శ్రీరామ నామ స్మరణతో గ్రామంలోని వీధులన్నీ తిరిగిన అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

హనుమాన్ చాలీసా పారాయణం

గంపలగూడెం: అయోధ్య రామ మందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని గంపలగూడెం షిరిడి సాయిబాబా ధ్యాన నిలయంలో సోమవారం రాత్రి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర దీక్షాపరులు ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 21 పర్యాయాలు చాలీసా పారాయణ చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో శోభాయాత్ర

ఆగిరిపల్లి: అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా స్థానిక ఆగిరిపల్లిలోని కోదండ రామాలయంలో సోమవారం సీతారాములకు ఆలయ అర్చకుడు రవికుమార్ అభిషేకాలు, శాంతి కల్యాణం, సహస్ర దీపాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. ఆగిరిపల్లి ఆర్య వైశ్య యూత్ ఆధ్వర్యాన పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

ముసునూరు: జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలు, రామనామ స్మరణలతో మండలం పులకించి పోయింది. అయోధ్య నగరంలో బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ సందర్భంగా మండలంలోని లోపూడి, చెక్కపల్లి, గోగులంపాడు, గుడిపాడు, ముసునూరు, పెదపాటివారిగూడెంలోని కోదండ రామాలయాలలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజాదికాలు, ఏక నామ స్మరణ చేశారు. వేల్పుచర్ల సీతారామ మందిరంలో వంశపారంపర్య పురోహితులు కాండూరి శ్రీరామచంద్ర స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

విస్సన్నపేట ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విస్సన్నపేట: అయోధ్యలో బాల రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న కోదండ సీతారామాంజనేయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


అర్జీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీలు పరిష్కరించడానికి వీలుకాకపోతే దానికి గల కారణాన్ని సంబంధిత అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. స్పందనలో 11 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపామన్నారు. నూజివీడు, చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాలకు చెందిన వారు అర్జీలు అందజేశారు. భూమిని సర్వే చేయాలని, పాస్ పుస్తకాలు అందించాలని, భూ తగాదాను పరిష్కరించాలని తదితర సమస్యలపై అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కర రెడ్డి, ఉద్యాన అధికారి రాజులపాటి హేమ, డీఎల్‌డీవో వెంకటరత్నం, ఏసీడీపీవో నాగేశ్వరి, పలువురు డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి విజేతలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో మండల స్థాయి విజేతల వివరాలను ఎంపీడీవో రామకృష్ణనాయక్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కబడ్డీలో కొండపల్లి-3 సచివాలయం (పురుషులు) జట్టు, కేతనకొండ-1 సచివాలయం (మహిళలు) జట్టు, బ్యాడ్మింటన్‌లో కొండపల్లి-5 (పురుషులు), కాచవరం (మహిళలు), వాలీబాల్‌లో కేతనకొండ-2 (పురుషులు) జట్టు, గుంటుపల్లి-3 (మహిళలు) జట్టు గెలుపొందాయి. ఖోఖోలో కొండపల్లి-5 (పురుషులు), కొండపల్లి-3 (స్త్రీలు), క్రికెట్‌లో మూలపాడు -1 పురుషుల జట్టు విజయం సాధించాయి.

మహిళా ఓటర్లే అధికం

నూజివీడు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,37,139

నూజివీడు: ఓటర్ల జాబితా సవరణ అనంతరం సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 286 పోలింగ్ స్టేషన్‌లలో నూతన ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. ఈ జాబితాల ప్రకారం నూజివీడు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,37,139 మంది. వీరిలో పురుష ఓటర్లు 1,17,398 మంది, మహిళా ఓటర్లు 1,19,730 మంది, థర్డ్ జెండర్ 11 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 2,332 మంది అధికంగా ఉన్నారు. ఈ మహిళా ఓటర్లు కూడా ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోనే ఎక్కువగా ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్లు	మొత్తం
చాట్రాయి	21550	21471	1	43022
ముసునూరు	22743	22557	3	45303
నూజివీడు(టౌన్)	20236	22020	6	42262
నూజివీడు(రూరల్)	28083	28519	1	56603
ఆగిరిపల్లి	24786	25163	0	49949
మొత్తం	1,17,398	1,19,730	11	2,37,139

తిరువూరులో...

తిరువూరు: సవరణ అనంతరం కొత్త ఓటర్ల జాబితాను తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధవి సోమవారం ప్రకటించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 234 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,01,327 మంది పురుష ఓటర్లుండగా, 1,04,142 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. మొత్తం 2,05,476 మంది ఓటర్లున్నట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. గంపలగూడెం మండలంలో పురుష ఓటర్లు 28,694 మంది, మహిళా ఓటర్లు 29,414 మంది, తిరువూరు మండలంలో పురుషులు 30,463 మంది, మహిళలు 31,899, విస్సన్నపేట మండలంలో పురుషులు 22,824 మంది, మహిళలు 23,538 మంది, ఎ.కొండూరులో పురుషులు 19,346 మంది, మహిళలు 19,291 మంది ఉన్నారు. ఎ.కొండూరు మండలంలో మాత్రమే 55 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. మిగిలిన మూడు మండలాల్లో మహిళలే ఎక్కువగా ఉండటం గమనార్హం. గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు 5వేల మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు.

మైలవరం నియోజకవర్గంలో 2.76లక్షల మంది ఓటర్లు

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,76,409 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,34,410 మంది ఉండగా, మహిళలు 1,41,981, ఇతరులు 18 మంది ఉన్నారు. మైలవరం మండలంలో మొత్తం 53,531, వీరిలో పురుషులు 26,161, మహిళలు 27,369, ఇతరులు ఒకరు ఉన్నారు. జి.కొండూరు మండలంలో మొత్తం 47,189, వీరిలో పురుషులు 22,977, మహిళలు 24,211, ఇతరులు ఒకరు, రెడ్డిగూడెం మండలంలో మొత్తం 38,448, వీరిలో పురుషులు 19,226, మహిళలు 19,222, కొండపల్లి మున్సిపాలిటీలో మొత్తం 50,771, వీరిలో పురుషులు 24,342, మహిళలు 26,424, ఇబ్రహీంపట్నంలో మొత్తం 32,625, వీరిలో పురుషులు 15,736, మహిళలు 16,888, విజయవాడ రూరల్‌లో మొత్తం 53,845, వీరిలో పురుషులు, 25,968, మహిళలు 27,867, ఇతరులు 10 మంది ఓటర్లు ఉన్నారు.

కడదాకా జగనన్నతోనే...

తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి స్వామిదాసు


సమావేశంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాస్

విస్సన్నపేట: నా తనువు చాలించేవరకు జగనన్నతోనే ఉంటానని, తిరిగి రెండోసారి జగనన్నని ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు నా శాయశక్తులా కృషి చేస్తానని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాస్ అన్నారు. స్థానిక పుట్రేల రోడ్డులో ఆర్సీఎం చర్చి ఎదురుగా మామిడి కాయ మార్కెట్ వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వామిదాసు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో 30 సంవత్సరాలుగా ఉన్నా తనకు తగిన ప్రాధాన్యం, మర్యాద ఇవ్వలేదన్నారు. కాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కార్యాలయానికి వెళ్లిన తమ దంపతులను ఆయన ఎంతో ఆప్యాయంగా పలకరించి అన్నా అని సంబోధించి స్వాగతం పలికారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై తాను వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధించటం ఎంతో మంచి పరిణామం అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవటానికి కార్యకర్తలు, నాయకులు ఒక్కతాటిమీద నడిచి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. తనకు ప్రాణం ఉన్నంతవరకు జగనన్నతోనే కొనసాగుతానన్నారు. తొలుత కొండపర్వ గ్రామంలో మల్లయ్యస్వామి, ఆంజనేయ స్వామి గుడి దగ్గర పూజలు నిర్వహించారు. ఎంపీ కేశినేని నాని పుట్టిన రోజు సందర్భంగా స్వామిదాసు, పార్టీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో 12 గ్రామాల నుంచి భారీగా హాజరైన కార్యకర్తలు, నాయకులు ఆనందోత్సాహాలతో జైజైలు కొట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, గ్రామ సర్పంచ్ నాగమల్లేశ్వరి, పుట్రేల సర్పంచ్ స్వాతి, తాతకుంట్ల సర్పంచ్ వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, మాజీ వైస్‌ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, ఏఎంసీ డైరెక్టర్ శేషగిరి, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలి

నూజివీడు: ఈ నెల 24 నుంచి నూజివీడులో నిర్వహించే ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆటల పోటీల నిర్వహణపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్ పోటీలను ధర్మ అప్పారావు కళాశాల ఆవరణలో, క్రికెట్ పోటీలను విస్సన్నపేట రోడ్డులోని మామిడి పరిశోధన కేంద్రం పక్కనే ఉన్న ఎంఐజీ లేఅవుట్లో నిర్వహిస్తామన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు సంబంధించిన షెడ్యూల్‌ను సబ్ కలెక్టర్ విడుదల చేశారు.

సంక్షిప్తంగా...

మైలవరం తహసీల్దారుకు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి

మైలవరం: మైలవరం తహసీల్దారు ఎం.శ్రీనివాసరావుకు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసరావును పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

నేడు పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవం



జి.కొండూరు: మండలంలోని వెలగలేరు గ్రామంలో నాడు-నేడు నిధుల నుంచి రూ.1.82 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించనున్నారు. వెలగలేరు పీహెచ్‌సీని నాడు-నేడు పథకం కింద అత్యాధునిక వసతులతో ఆరు పడకల ఆస్పత్రిగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది. వెలగలేరుతో పాటు కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, సున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, ఎనికేపాడు, గూడవల్లి, పాతపాడు గ్రామాలకు చెందిన ప్రజలకు ఈ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందనుంది.

లేగదూడల అందాల ప్రదర్శన

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ గ్రామంలో లేగ దూడల అందాల ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వి.నాగేంద్రమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 63 మంది రైతులకు సంబంధించిన 92 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. పోటీలో విజేతలైన లేగదూడల యజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకుడు డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ లేగదూడల పెంపకంలో తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి, సహాయ సంచాలకుడు కె.రామారావు, పశు వైద్యులు తులసి, గోపాలమిత్ర కె.పుల్లయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో ఆర్డీవో సమావేశం

తిరువూరు: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో కె.మాధవి సమావేశం నిర్వహించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో చిరునామా మార్పులు, సవరణల ప్రక్రియ గురించి వివరించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. తిరువూరు డివిజన్లో భూముల రీసర్వే గురించి వివరించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఎం, బీజేపీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నూజివీడులో కరసేవకులకు సత్కారం

నూజివీడు: పట్టణంలోని హనుమాన్ సేన ఆధ్వర్యాన తపన ఫౌండేషన్ సహకారంతో అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠను పట్టణ ప్రజలు వీక్షించేందుకు సోమవారం ధర్మ అప్పారావు కళాశాల ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ 1992లో అయోధ్యలో కరసేవలో పాల్గొన్న నూజివీడుకి చెందిన కరసేవకులు అవారపు సత్యనారాయణ, కలపాల రామారావు, వెలివెల శోభనాచలం, సుంకర శ్రీనివాసరావులను గారపాటి చౌదరి, అనంత శ్రీరామ్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అనంత్ శ్రీరామ్ శ్రీరామునిపై పాటలు పాడి రామ భక్తులను అలరించారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చోడిశెట్టి పవన్ సూర్య, దోసపాటి భాస్కర్‌రావు, పి.కిషోర్, బీజేపీ నియోజకవర్గ నాయకుడు జీఆర్‌కే రంగారావు పాల్గొన్నారు.

చాట్రాయిలో కరసేవకులకు పౌర సన్మానం

చాట్రాయి: అయోధ్యలో 1992లో జరిగిన కరసేవకు తరలి వెళ్లిన సేవకులను సోమవారం మండలంలోని చాట్రాయి గ్రామంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠ సందర్భంగా అప్పటి కరసేవకులు గడ్డం సంజీవరెడ్డి, తోటకూర వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, ఆదిమూలపు సురేష్, పోతిరెడ్డిపల్లి చెన్నారావు, గోల్కొండ చెన్నారావులను రామాలయ కమిటీ చైర్మన్ దామెర బుచ్చిబాబు, భక్త బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవాలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాబూఖారీ దర్గా 427వ ఉరుసు మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. రెండోరోజు ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ వెస్ట్ నియోజకవర్గం సమన్వయకర్త ఎండీ ఆసీఫ్ దర్గా సందర్శించారు. మసీదు పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజా వైఎస్సార్ సీపీ నాయకులకు స్వాగతం పలికారు. వారు బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో గంథం ఊరేగింపు వైభవంగా జరిగింది. ఒంటెలు, ఏనుగులు, గుర్రాలు, రాజస్తాన్ బ్యాండ్‌మేళం ఊరేగింపులో ఆకర్షణీయంగా నిలిచాయి.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

వెల్వడం(మైలవరం): ఖమ్మం గ్రేస్ సొసైటీ ఆధ్వర్యంలో మైలవరం మండలం పొందుగల గ్రామంలోని చర్చిలో 50 మంది వృద్ధులకు దుప్పట్లు, 60 మంది చిన్నారులకు గిఫ్ట్‌ప్యాక్‌లు, స్నాక్స్ ప్యాకెట్లు, టాయ్స్ ఉచితంగా పాస్టర్ మనష్షే ద్వారా వెల్వడం సర్పంచ్ పి.ధర్మరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రేస్ సొసైటీ వారికి పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు.

వాటర్ ట్యాంకర్ ప్రారంభం

నూజివీడు: పట్టణ ప్రజల మంచినీటి అవసరాలకు తపన ఫౌండేషన్ ద్వారా నూతన వాటర్ ట్యాంకర్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, హైకోర్టు న్యాయవాది సింగపూర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

నూజివీడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం నాటికి 84 మంది అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరినట్లు సీడీపీవో ఎస్‌వై నూరాణి తెలిపారు. వీరిలో 45 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 39 మంది హెల్పర్లు ఉన్నారన్నారు. మిగిలిన 511 మంది అంగన్‌వాడీ సిబ్బందికి తొలగింపు ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేంద్రీయ పాఠశాలలో పెయింటింగ్ పోటీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు స్థానిక కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం పెయింటింగ్ పోటీ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.